క్లుప్తంగా

గడువు పొడగింపు

గద్వాల అర్బన్: సాంఘిక, సంక్షేమ, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకులాల్లో 5వ తరగతి, సీఓఈ కళాశాలలకు 2024–25 విద్యాసంవత్సరం ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడగించినట్లు డీసీఓ రఘు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గో తరగతి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని, రూ.100పరీక్ష రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు పాత జిల్లాను యూనిట్‌గా పరిగణించి సీట్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

యువతి అదృశ్యం

ధరూరు: యువతి పరీక్ష రాసేందుకు హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రేవులపల్లి పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మండలంలోని చిన్నపాడుకు చెందిన ప్రేమలత (20) గత నెల 10న హైదరాబాద్‌లో పరీక్ష ఉందని చెప్పి వెళ్లింది. ఇప్పటి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గ్రామాలు, తెలిసిన వారిని అడిగినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం ప్రేమలత తండ్రి నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

మాజీ స్పీకర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



అయిజ: హైదరాబాద్‌లోని గ్రీన్ పార్క్ హోటల్లో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌తో పాటు అయిజ, గద్వాల మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం కర్ణాటక మాజీ స్పీకర్ కేఆర్ రమేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా, పూలమాలలతో సత్కరించారు. జోగుళాంబ గదాల జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి, జోగుళాంబ గద్వాల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ కార్యదర్శి ఎండీ ఫిరోజ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ వైస్ ప్రసిడెంట్ పాండురంగరాజు పాల్గొన్నారు.

నిందితుడికి 14రోజులు రిమాండ్

ధరూరు: గతంలో ఉన్న పాత కక్షలతో ఇరు వర్గాలు దాడులు చేసుకున్నారు. అనంతరం ఇరు వర్గాలు ఫిర్యాదు చేయడంతో వ్యక్తికి 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. రేవులపల్లి పోలీసుల కథనం ప్రకారం.. రేవులపల్లికి చెందిన గట్టు ఆంజనేయులు, లక్ష్మయ్యలకు గతం నుంచి పాతకక్షలున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి రేవులపల్లి చౌరస్తా వద్ద మాటామాటా పెరిగి దాడులు చేసుకున్నారు. ఇరు వర్గాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదు చేశారు. లక్ష్మయ్యను బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థి అదృశ్యం



ధరూరు: పండగ సెలవులకు ఇంటికొచ్చిన ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన మండలంలోని మార్లబీడులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మార్లబీడుకు చెందిన వడ్ల నితీష్‌కుమార్(16) గ్రామానికి సమీపంలో ఉన్న గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చాడు. ఈ నెల 11వ తేదీ మధ్య రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ప్రభుదాసు ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూర్: పట్టణంలోని గాంధీచౌక్‌లో ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించి ఒకరిపై కేసు నమోదు చేశారు. వాహనదారుల హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. 12 బైకులకు జరిమానాలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, తాగి డ్రైవింగ్ చేయరాదని వాహనదారులకు సూచించారు.

వేధిస్తున్న భర్తపై పోలీసులకు ఫిర్యాదు

అమరచింత: వివాహం జరిగినప్పటి నుంచి భర్త శ్రీనివాసులు వేధింపులకు గురిచేస్తున్నాడని భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు గృహ హింస కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. పట్టణానికి చెందిన మౌనికను హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులుతో 2021లో వివాహం జరిపించారు. వివాహం జరిగినప్పటి నుంచి ప్రతినిత్యం శ్రీనివాసులు మౌనికను వేధిస్తూ, అదనపు కట్నం కోసం హింసకు గురిచేస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మార్కెట్ వినియోగం ఎప్పుడో?

- ఇంటిగ్రేటెడ్ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు
- చిరు వ్యాపారులకు 40 గదుల నిర్మాణం
- ఎన్నికలముందు హడావిడిగా ప్రారంభం
- నేటికి ఉపయోగంలోకిరాని వైనం



అయిజలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్

అయిజ: పట్టణంలోని ప్రధాన రోడ్లపై చిరు వ్యాపారులు క్రయ, విక్రయాలు నిర్వహించరాదని, దాని వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని, ప్రమాదాలు చోటుచేసుకుంటాయని భావించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అయిజ మున్సిపాలిటీలో రూ.1.50 కోట్ల నిధులతో 40 గదులు నిర్మించారు. ప్రహరీకి రూ.15 లక్షలు, స్ట్రీట్ వైడింగ్‌కు రూ.10 లక్షలు, కల్వర్టుల నిర్మాణానికి రూ.5లక్షలు, రీటైనింగ్ వాల్‌కు రూ.15 లక్షలు, గ్రీనరికి రూ.3లక్షలు అదనంగా మంజూరయ్యాయి. నిర్మాణం పూర్తయి రెండేళ్లు గడిచింది. ఇంతవరకు వినియోగంలోకి రాలేదు.

మంత్రి చేతుల మీదుగా ప్రారంభం..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల కోడ్ పడుతుందనే ఉద్దేశంతో అప్పటి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించారు. సమీకృత మార్కెట్ సముదాయాన్ని ప్రారంభించి రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు వినియోగంలేకి రాలేదు. దానివల్ల ఇప్పటికీ చిరు వ్యాపారులు ప్రధాన రోడ్లపైనే పండ్లు, పూలు, కూరగాయలు, మాంసం, చేపలు విక్రయిస్తున్నారు. రోడ్డుపై ట్రాఫిక్ జాం అవుతూనే ఉంది. రోడ్డుపై తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

బ్రిడ్జి నిర్మాణంతో అనేక ఇక్కట్లు..

పట్టణంలోని పాతబస్టాండ్ కొత్త బస్టాండ్ మధ్య పెద్దవాగుపై వంతెన నిర్మిస్తుండడంతో దారి మళ్లించారు. దానివల్ల రోడ్డుపై ప్రమాదాలు గతంలో కంటే ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. సమీకృత మార్కెట్ సముదాయాన్ని త్వరగా ప్రారంభించాలని చిరు వ్యాపారులు రెండేళ్లుగా కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మంత్రి హడావిడిగా ప్రారంభం చేసి చేతులు దులుపేసుకున్నారనే విమర్శలను అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎదుర్కొంటున్నారు.



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ముఖద్వారం

జంతువులకు ఆవాసం..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకరాకపోవడంతో 40 గదులు వృథాగా ఉన్నాయి. ఆ ప్రదేశం పందులు, కుక్కలు, కోతులకు ఆవాసంగా మారింది. రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సమీకృత మార్కెట్ సముదాయం పాతబస్టాండ్‌లోని ప్రధాన రోడ్డు పక్కన ఉండడంతో ప్రయాణికులు ఆ ప్రదేశంలో కాల కృత్యాలు తీర్చుకుంటున్నారు. కనీసం గేట్లకు తాళం వేయాలనే ఆలోచనలో కూడా అధికారులు లేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

పారదర్శకంగా నిర్వహిస్తాం..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు పారదర్శకంగా పనిచేస్తాం. చిరు వ్యాపారులు ఉపయోగించుకునేందుకు ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియను నిర్వహిస్తాం. టెండర్‌లో గదులను దక్కించుకున్నవారికి ఆయా గదుల ను అప్పగిస్తాం. నిబంధనల మేరకు అన్ని పనులు పూర్తిచేసి వినియోగంలోకి తెస్తాం. చిరువ్యాపారులు ఎలాంటి అపోహలు కలిగి ఉండకుండా సద్వినియోగం చేసుకోవాలి.

– నిత్యానంద్, మున్సిపల్ కమిషనర్, అయిజ

విక్రయించేందుకు ఇబ్బందిగా ఉంది



కొన్ని సంవత్సరాలుగా పాతబస్టాండ్‌లో పండ్ల వ్యాపారం చేస్తున్నాను. రోడ్డు పక్కన వ్యాపారం చేయడం ఇబ్బందిగా ఉంది. చిన్న బంకు ఏర్పాటు చేసుకొని ప్రతి రోజు ఉదయం పండ్లు బయటికి తీసి రాత్రి సమయంలో మళ్లీ బంక్‌లో పెట్టి తాళం వేయాల్సి వస్తోంది. ప్రభుత్వం నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం అందుబాటులోకి తెస్తే వినియోగించుకోవాలనుకుంటున్నాం.

– వీరేష్, పండ్ల వ్యాపారి, అయిజ

వ్యాపారం కష్టంగా ఉంది..



ప్రధాన రోడ్డు పక్కన చిన్న బండిపై పూల వ్యాపారం చేయడం కష్టంగా ఉంది. దుమ్ము, దూళీ పూలపై పడడం వల్ల త్వరగా వాడిపోతున్నాయి. రోడ్డు పక్కన విక్రయదారులు వాహనాలు నిలిపి కొనుగోలు చేయడంతో ప్రమాదకరంగా అనిపిస్తుంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం ప్రారంభించినా ఇప్పటి వరకు అమలులోకి రాలేదు. అవి మాకు కేటాయిస్తే బాగుంటుంది.

– ఆలీ బాషా, పూల వ్యాపారి, అయిజ

పేదవారికి కేటాయించాలి..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలోని గదులను చిరువ్యాపారులు ఉపయోగించుకోవడానికి ఆన్‌లైన్ టెండర్ వేస్తామని అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్ టెండర్ వేస్తే డబ్బున్నవారు మాత్రమే టెండర్‌లో పాల్గొంటారు. పేదవారికి అది అసాధ్యంగా ఉంటుంది. పేదరికంలో ఉన్న చిరు వ్యాపారులను గుర్తించి వారికి గదులను కేటాయించి నెలవారి అద్దెను వసూలు చేస్తే వెసులుబాటుగా ఉంటుంది.

– మహ్మద్ గౌస్, వ్యాపారి, అయిజ

సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే విజయుడు, మండల బీఆర్ఎస్ నాయకులు

అయిజ: తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశానికి అలంపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే విజయుడుతో పాటు మండలంలోని బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు మండలంలోని పార్టీ పరిస్థితులపై బీఆర్ఎస్ పార్టీ అధినేతల దృష్టికి తీసికెళ్లినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

కంకర తేలి దుమ్ము లేస్తోంది



బూరెడ్డిపల్లి–మార్లబీడు మధ్య కంకర తేలి దుమ్ము లేస్తున్న రోడ్డు



బిజ్వారం–సంగాల గ్రామాల మధ్య గుంతలు ఏర్పడిన రోడ్డు

ధరూరు: గట్టు మండలానికి వెళ్లే రోడ్డు పట్ట పగలే వాహనదారులకు నరకం చూపిస్తోంది. ధరూరు నుంచి గట్టుకు వెళ్లే మార్గంలో రోడ్డు వెంట కంకర తేలి దుమ్ము లేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించకుండా దుమ్ము ఎగసిపడుతుండడంతో అటుగా నిత్యం ప్రయాణాలు కొనసాగించే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రెండు మండలాల ప్రజలు పేర్కొంటున్నారు. ధరూరు–బూరెడ్డిపల్లి–చెన్నారెడ్డిపల్లి–మార్లబీడు గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు ప్రమాదాలు జరగకముందే పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు. పనులను నిలిపేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బిజ్వారం రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

మల్దకల్: మండలంలోని బిజ్వారం–సంగాల మధ్య ఉన్న బీటీ రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిపై ప్రతినిత్యం వందలాది వాహనాలతో పాటు గద్వాల ఆర్టీసీ డిపో బస్సు రాకపోకలు సాగిస్తుంది. రాత్రి వేళలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు దేవసాయం, తిమ్మప్ప, మహ్మద్‌లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధ్వానంగా తారురోడ్లు

గట్టు: తారురోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై వేసిన తారు ఎగిరి పోయి, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కారు యజమానులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి మల్దకల్ వరకు 15 కిలోమీటర్ల రోడ్డును రెండేళ్ల క్రితం మండల కేంద్రం నుంచి పెంచికలపాడు శివారు వరకు తారు వేశారు. ఆరగిద్ద స్టేజీకి కొద్ది దూరంలో కొత్తరోడ్డును తవ్వడంతో తారు రోడ్డు దెబ్బతింది. మండల కేంద్రం నుంచి మాచర్ల రోడ్డు భారీ వాహనాల రాక పోకల కారణంగా పూర్తిగా దెబ్బతింది. రోడ్డు కుంగి పోయి, గుంతలు ఏర్పడడంతో తారు రోడ్డుపై మట్టిని వేసి, గుంతలను పూడ్చే పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రం చేరుకునే రోడ్లు అధ్వానంగా మారినా, పాలకులు పట్టించుకోక పోవడంతో వాహనదారులతో పాటుగా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గట్టు మల్దకల్ దారిలో ఆరగిద్ద స్టేజీ సమీపంలో..



గట్టు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో దెబ్బతిన్న తారు రోడ్డు

అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

వృద్ధురాలు అదృశ్యం

గద్వాల క్రైం: వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన బుధవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. పాత హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన గాండ్ల శివ గంగమ్మ కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయింది. అయితే ఈ నెల 12న ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లింది. నేటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. బంధువులతో చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కూతురు శ్రీవిద్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

త్రైతసిద్ధాంత గ్రంథాల అందజేత



కేటీదొడ్డి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా అధ్యక్షుడు రాఘవేంద్రాచారి అన్నారు. బుధవారం మండలంలోని నందిన్నె గ్రామంలోని భగవద్గీత ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరుల గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు రవికుమార్, మనోహర్, రమేష్, మహేష్, లావణ్య, సువర్ణ, భాగ్య, మంజుల, సబిత, శిరీష పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై హైమాస్ట్ లైట్లు ఏవి?



మానవపాడు: ప్రమాదాల నివారణకు జాతీయ రహదారిపై విద్యుత్ లైట్లు ఎక్స్‌రోడ్డు సమీపాన నిర్మించాలని ప్రజలు అధికారులను కోరినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారి మానవపాడు స్టేజీ నుంచి వయా బోరవెల్లి, జల్లాపురం, పల్లెపాడు, చందూరు, వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి అధికారులు సైతం నిత్యం వాహనాల ద్వారా ప్రయాణిస్తుంటారు. రాత్రి సమయంలో మానవపాడు స్టేజీ సమీపంలో చీకటిమయంగా మారుతోంది. ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. చాలా ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అయోధ్య రాముడి అక్షతల పంపిణీ



ధరూరు: అయోధ్య రాముడి అక్షతలను మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. బుధవారం నెట్టెంపాడు గ్రామంలో గ్రామ భజన మండలి సభ్యులు ఇంటింటికీ తిరిగి అందజేశారు. కార్యక్రమంలో భీంరెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకు నిధులు కేటాయించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ జెడ్పీచైర్‌పర్సన్ సరిత బుధవారం హైదరాబాద్‌లోని సెక్రటరియేట్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. బీసీ సంక్షేమానికి పెద్దపీట వేయాలని, విద్య, వైద్యం, బీసీ సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలలకు వసతులు కల్పించాలని ఆమె కోరారు. అంతకు ముందు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు తిరుపతయ్య ఉన్నారు.

చిన్నారులు క్రమశిక్షణతో మెలగాలి



శిక్షణ శిబిరానికి హాజరైన చిన్నారులు



మాట్లాడుతున్న గుడ్ లైఫ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ శ్యాం

అయిజ: నేటి చిన్నారులు భవిష్యత్‌లో భావిభారత పౌరులని, క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని గుడ్‌లైఫ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ శ్యాం గుంటి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పదివేల మంది చిన్నారులకు క్రమశిక్షణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెదటి ప్రాధాన్యత ఎవరికి ఇవ్వాలని అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్‌లైఫ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ శ్యాం గుంటి మాట్లాడారు. చిన్నారులు మెదటి ప్రాధాన్యత దేవుడికి ఇవ్వాలని, రెండో ప్రాధాన్యత తల్లిదండ్రులకు ఇవ్వాలన్నారు. మినిస్ట్రీస్ ద్వారా వికలాంగులకు మందులు, ట్రైసైకిళ్లు అందించామని, పేదలకు కంటి పరీక్షలు, వైద్య సేవలు చేయించామని, జీఎల్ఎం ద్వారా పేద విద్యార్థులకు మండల కేంద్రంలో రెండు వేల మందికి పైగా ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్స్ అందజేశామన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు లక్షమంది చిన్నారులకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జీఎల్ఎం సభ్యులు టాక్ జాన్సన్, సైమన్, జాన్ డేవిడ్, శ్యాంబాబు, యుగేందర్, డేవిడ్, సుజిత్, రత్నాకర్ పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా విక్రయిస్తే కేసు నమోదు



మల్లాపురం తండాలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కేటీదొడ్డి: కల్తీకల్లు, మద్యం లైసెన్స్‌లు లేకుండా కల్లు విక్రయిస్తే కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ గోపాల్ అన్నారు. మండలంలోని రంగాపురం, ఉమిత్యాలతండా, మైలగడ్డ, కుచినెర్ల, పాతపాలెం, గ్రామాల్లో బుధవారం కల్తీకల్లు, సారా, బెల్ట్‌షాపులను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎవరైనా లైసెన్స్ లేకుండా అక్రమంగా కల్లు, సారా తయారీ చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇస్తే వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. వారి వెంట ఎక్సైజ్ ఎస్‌ఐలు కానిస్టేబుళ్లు ఉన్నారు.

మలుపులతో ఇబ్బందులు



ఉండవెల్లికి వెళ్లే దారిలో మూలమలుపులో దెబ్బతిన్న బీటీ

ఉండవెల్లి: మండలం కేంద్రానికి వచ్చే దారిలో మలుపులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి ఉండవెల్లికి వచ్చే దారిలో మూల మలుపులలో బీటీ దెబ్బతినడంతో గుంతలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరోక చోట బ్రిడ్జి దెబ్బతినడంతో ఎప్పుడు కూలుతుందో తెలియక భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు నిత్యం ప్రయాణిస్తున్న పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్: బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాలమ్మ అంగన్‌వాడీ టీచర్లుకు సూచించారు. బుధవారం మల్దకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణీలు పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలను తీసుకోవాలన్నారు. నెలనెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలలో అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి సమీపంలో గల కొమ్ములగట్టు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామం నుంచి స్వామి వారిని పల్లకీ సేవలో ఊరేగించారు. ఈ సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గ్రామస్తులతో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలు అందించి పూజలు చేశారు. జంగమాయపల్లితో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈనెల 17 నుంచి 27వరకు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు, అభిషేకం, కల్యాణోత్సవం జరిపించారు. పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు రమేష్‌గౌడ్ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్, ఆలయ కమిటీ చైర్మన్ కొండల్, జిల్లా కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి గిరిజ, మాజీ వైస్ ఎంపీపీ ఉమ, నీలేందర్, సురేందర్‌గౌడ్, సుభాష్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి ఉన్నారు.

రైస్‌మిల్ అసోసియేషన్ ఎన్నిక



కొత్తకోట రూరల్: జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుంత మల్లేష్ ఆధ్వర్యంలో మండల రైస్‌మిల్ అసోసియేషన్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విశ్వనాథం వెంకటరమణ, జనరల్ సెక్రెటరీగా ఎద్దుల కవిందర్‌రెడ్డి, కోశాధికారిగా కొండ శివ, ఉపాధ్యక్షులుగా నాగన్న, బి.రమణ, కార్యవర్గ సభ్యులుగా కొట్టం వంశీధర్‌రెడ్డి, భీమ భాస్కర్, బాలకృష్ణారెడ్డి, భీమ సంతోష్, రవితేజ, సంపత్‌రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కమిటీని సభ్యులు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అకారణంగా అధికారుల దాడులు, మిల్లుల సమస్యలను కలిసికట్టుగా చర్చించుకుని పరిష్కార దిశగా ఆలోచించాలని తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన మండల రైస్ మిల్లుల యజమానులకు విశ్వనాథం వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు.